సాక్షి
విశాఖపట్నం
ఆదివారం । 12 । అక్టోబర్ । 2025



గ్లో అప్ గాల మిలమిల

వెస్ట్రన్, సంప్రదాయ వస్త్రాలు ధరించిన మహిళలు హంస నడకల్లా ఒయ్యారాలు ఒలకబోశారు. ర్యాంప్ మురిసేలా నడిచారు. గ్లో అప్ గాల పేరుతో మేకప్ అవార్డ్స్ ఈవెంట్ వావ్ అనిపించింది.



గాల్లో గింగిరాలు..

శరీరమే ఒక శిల్పం, చలనమే ఒక కళ..అంతర జిల్లాల జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు జిల్లా జట్ల ఎంపిక పోటీల్లో చిన్నారులు చేసిన విన్యాసాలు విస్మయానికి గురిచేశాయి.

8లో

ప్రభుత్వ భూమిపై ప్రైవేటు వసూళ్లు!



200 మంది నుంచి ఏకంగా రూ.50 కోట్లు స్వాహా!

- ప్రభుత్వ భూమిని ప్రైవేటు భూమిగా నకిలీ డాక్యుమెంట్లు
- ఏకంగా నకిలీ ఈసీ సృష్టించిన ముఠా
- విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న ఇద్దరు డీఈఈల నిర్వాకం



రూరల్ తహసీల్దార్ నరసింహమూర్తి పేరుతో సృష్టించిన నకిలీ వన్ బీ

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:


ప్రభుత్వ భూమిని ప్రైవేటుగా చూపించి ఏకంగా రూ.50 కోట్లు వసూలు వ్యవహారం చర్చనీయాంశమవుతోంది. ఇందుకోసం ఇద్దరు తహసీల్దార్ల పేరుతో నకిలీ డాక్యుమెంట్లు, నకిలీ ఎండార్స్‌మెంట్లతో పాటు ఏకంగా నకిలీ ఈసీని కూడా సృష్టించిన వ్యవహారం తాజాగా వెలుగులోకి వచ్చింది. విద్యుత్ శాఖలో పనిచేసే ఇద్దరు ఇంజనీర్లు (డీఈఈలు) ఈ తతంగమంతా నడిపించారు. తమతో పాటు పనిచేసే సుమారు 200 మంది నుంచి చెరో రూ.25 లక్షల చొప్పున మొత్తం రూ.50 కోట్ల వరకూ వసూలు చేశారు. మధురవాడ పనోరమ హిల్స్ జంక్షన్‌కు సమీపంలోని సర్వే నెంబరు 368–3లోని భూమిని చూపించి వసూళ్లకు తెగబడినట్టు తెలుస్తోంది. వాస్తవానికి ఇది ప్రభుత్వ భూమి. మొత్తం విస్తీర్ణం 3.6 ఎకరాలు. ఇక్కడ ఎకరా విలువ రూ.20 కోట్లకుపైగానే పలుకుతోంది. 100 అడుగుల రోడ్డుకు ఆనుకుని ఉన్న ఈ భూమి తక్కువ ధరకే అందుబాటులోకి వచ్చిందంటూ నమ్మించి భారీగా వసూలు చేశారు. ఇందుకోసం ఇద్దరు తహసీల్దార్ల పేరుతో ఫలానా వారికి పట్టా ఇచ్చారంటూ నకిలీ రికార్డులు సృష్టించారు. చలానాలు కూడా కట్టించి రిజిస్ట్రేషన్ల శాఖ సిబ్బందితో కలిసి రిజిస్ట్రేషన్‌ను పెండింగ్‌లో ఉంచేలా కథ నడిపించారు. నకిలీ ఈసీని కూడా సృష్టించి నమ్మించారు. అయితే, అవి నకిలీవని తెలియడంతో వారంతా ఇప్పుడు ఉసూరుమంటున్నారు. వారికి ఇప్పుడు మరో భూమిని చూపించి రిజిస్ట్రేషన్ చేస్తామంటూ కొత్త నాటకానికి తెరలేపినట్టు సమాచారం.

రూ.50 కోట్లు వసూళ్లు!

ఈ సర్వే నెంబరులోని భూమి తక్కువ ధరకే ఒక్కొక్కరికి రిజిస్ట్రేషన్ చేపిస్తామంటూ నమ్మబలికి మొత్తం 200 మంది నుంచి రూ.25 లక్షల చొప్పున వసూలు చేసినట్టు తెలుస్తోంది. వీరంతా విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు కావడం గమనార్హం. ఈ ముఠాకు నేతృత్వం వహిస్తున్న ఇద్దరు వ్యక్తులు కూడా విద్యుత్‌శాఖలో ఇంజనీర్లుగా పనిచేస్తున్నారు. గతంలో ఈ విధంగానే 50 మంది నుంచి చెరో రూ.25 లక్షలు వసూలు చేసి ఒక ప్రైవేటు భూమిని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించడంతో వీరిపై నమ్మకం కుదిరింది. దీన్ని వాడుకుని ఈసారి ఏకంగా 200 మంది నుంచి రూ.25 లక్షల చొప్పున మొత్తం రూ.50 కోట్లు వసూలు చేశారు. విద్యుత్‌శాఖలో తమకు ఉన్న పరిచయాల ద్వారా తమ సిబ్బంది నుంచే ఈ విధంగా వసూళ్లకు పాల్పడ్డారు. అంతేకాకుండా ఎప్పటికప్పుడు కూటమి నేత, మాజీ హోం మంత్రి అండదండలున్నాయని కూడా బలంగా నమ్మించినట్టు తెలుస్తోంది.

తహసీల్దార్ల పేరుతో నకిలీ డాక్యుమెంట్లు..!

మధురవాడలోని సర్వే నెంబరు 368–3లోని భూమి ప్రభుత్వానికి చెందినది. ఈ భూమిని లింగం సోమసుందరరావు పేరుతో పట్టా ఇచ్చారంటూ సెటిల్‌మెంట్ పట్టాను సృష్టించారు. గతంలో విశాఖ రూరల్ తహసీల్దార్లగా పనిచేసిన నరసింహమూర్తితో పాటు హత్యకు గురైన సనపాల రమణయ్య పేరు మీద నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారు. నకిలీ అడంగల్, నకిలీ పట్టాలతో పాటు పై ఇద్దరూ తహసీల్దార్లు కూడా ఈ సర్వే నెంబరులో ఫలానా వ్యక్తికి పట్టా ఉందంటూ నివేదిక ఇచ్చినట్టు కూడా నకిలీ పత్రాలు ఏర్పాటు చేశారు. వసూలు చేసిన వారికి వీటిని చూపించడంతో పాటు రిజిస్ట్రేషన్ సిబ్బందితో కలిసి వ్యవహారం నడిపించారు. ఈ వ్యవహారంలో రిజిస్ట్రేషన్ శాఖలోని కొద్దిమంది సిబ్బందికి ఏకంగా రూ.కోటి వరకూ ముట్టచెప్పినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



సర్వే ఏడీ జారీ చేసిన సెటిల్‌మెంట్ రికార్డు వివరాలు

రిజిస్ట్రేషన్ శాఖ సిబ్బందితో కలిసి..!

వాస్తవానికి ఈ సర్వే నెంబరులోని భూమి ప్రభుత్వానికి చెందినదని స్పష్టంగా రికార్డుల్లో ఉంది. నిషేధిత జాబితా (22ఏ)లో ఉంది. అందువల్ల రిజిస్ట్రేషన్ చేయడం కుదరదు. అయినప్పటికీ మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి చెందిన ఒక అధికారితో మాట్లాడుకుని మొదటి దశలో ఒక 30 మంది రిజిస్ట్రేషన్‌కు వస్తారని... వారి నుంచి చలానా కట్టించుకుని రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించాలని కోరారు. ఇది ప్రభుత్వ భూమి కావడంతో రిజిస్ట్రేషన్ చేయడం కుదరనందున.. చలానాలు కట్టించుకుని రిజిస్ట్రేషన్ చేసినట్టుగా చేసి సహకరించాలని విన్నవించారు. ఆ తర్వాత రిజిస్ట్రేషన్‌ను పెండింగ్‌లో ఉంచితే చాలని కోరారు. ఇందుకోసం భారీగానే మాముళ్లు మాట్లాడుకున్నట్టు తెలుస్తోంది. ఈ విధంగానే మొత్తం వ్యవహారం నడిచింది. ఒక్కొక్కరు చెరో రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల మేర చలానా కూడా కట్టారు. తమకు రిజిస్ట్రేషన్ అయ్యిందని మొదటి బ్యాచ్ సంబరపడిపోయింది. మిగిలిన బ్యాచ్‌కు కూడా త్వరలో పెడతానంటూ సదరు ముఠా నమ్మబలికింది. అంతేకాకుండా మొదటగా రిజిస్ట్రేషన్ చేసిన వారికి దొంగ ఈసీలను కూడా సృష్టించి అందజేయడం గమనార్హం. విజయవాడలోని ఒక నిపుణుడైన డీటీపీ కార్యాలయంలో ఈ ఫేక్ ఈసీని సృష్టించి.. వారి పేరు మీద రిజిస్ట్రేషన్ అయినట్టుగా చూపించారు. అయితే కొందరు అవసరాల నిమిత్తం ఈ భూమిని విక్రయించడానికి ప్రయత్నించగా ఈసీ నకిలీదని తెలియడం అవాక్కయ్యారు. ఇప్పుడు అదే ముఠా కూటమిలోని ఒక నేత పేరుతో కొత్త సర్వే నెంబరుతో రిజిస్ట్రేషన్ కోసం దిగినట్టు తెలుస్తోంది.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా
‘కోటి సంతకాల ఉద్యమం’



కోటి సంతకాల సేకరణ ‘ప్రజా ఉద్యమం’ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేకే రాజు, వైఎస్సార్‌సీపీ నేతలు

సాక్షి, విశాఖపట్నం: ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయాలనే కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల ప్రజా ఉద్యమం చేపట్టింది. ఈ ఉద్యమంలో మేధావి వర్గాలు, ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజలు పాల్గొనాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు కోరారు. మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో విశాఖ ఉత్తర నియోజకవర్గం పోస్టర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ... ప్రజల ఆరోగ్య హక్కులను కాపాడేందుకు, ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు అప్పగించే కుట్రలను అడ్డుకునేందుకు ఈ ఉద్యమం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతోందన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని మెడికల్ కళాశాల నిర్మాణాలను కొనసాగించే వరకు ఉద్యమం ఆగదని హెచ్చరించారు. కేంద్రంలోని బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎక్కడా వైద్య కళాశాలలను ప్రైవేటుకు అప్పగించలేదని గుర్తు చేస్తూ.. బీజేపీ సిద్ధాంతాలకు విరుద్ధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు తొత్తుగా పనిచేస్తున్నారంటూ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌పై కేకే రాజు విమర్శలు గుప్పించారు. అంతేకాకుండా ఈ ప్రభుత్వంలో వసతిగృహాల్లోని విద్యార్థులకు కూడా సరైన భోజనం, తాగునీరు అందించలేని పరిస్థితి ఉందని మండిపడ్డారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కె. సతీష్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్ సాడి పద్మారెడ్డి, కార్పొరేటర్లు కె.అనిల్ కుమార్ రాజు, రెయ్యి వెంకటరమణ, బర్కత్ అలీ, శశికళ, కో–ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్ రాజు, ఎస్ఈసీ మెంబర్ పీలా వెంకటలక్ష్మి, వలంటీర్ విభాగం జోనల్ ప్రెసిడెంట్ ఎం.సునీల్, జిల్లా అనుబంధ విభాగం అధ్యక్షులు నీలి రవి, రామిరెడ్డి, వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డి, పైడి రమణ, బొడ్డేటి కిరణ్, బలిరెడ్డి గోవింద్, కె.సుకుమార్, మాజీ కార్పొరేటర్ దల్లి రామకృష్ణా రెడ్డి, నియోజకవర్గ అనుబంధ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు

• గుడివాడ గురునాథరావుకు ఘన నివాళి



దివంగత నేత గుడివాడ గురునాథరావు జయంతి సందర్భంగా శనివారం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల ఆయన విగ్రహానికి అరకు ఎంపీ తనూజా రాణి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, సమన్వయకర్తలు అదీప్ రాజ్, మొల్లి అప్పారావు, దేవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తైనాల, చింతలపూడి వెంకట్రామయ్య పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తిత్వం జస్టిస్ రామస్వామి సొంతం

ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్



జస్టిస్ రామస్వామి చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సుప్రీం కోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ కె. రామస్వామి చిత్రపటాన్ని శనివారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ ఆవిష్కరించారు. గతంలో జస్టిస్ కె.రామస్వామి ఏయూలో ‘పబ్లిక్ పవర్ అండ్ జ్యుడిషియల్ ఫంక్షన్’ అనే అంశంపై అందించిన ప్రసంగాన్ని, పునర్ముద్రించిన పుస్తకాన్ని జస్టిస్ బట్టు దేవానంద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జస్టిస్ బట్టు దేవానంద్ మాట్లాడుతూ మహోన్నత వ్యక్తిత్వం జస్టిస్ కె.రామస్వామి సొంతమని కొనియాడారు. విద్యార్థి నాయకుడిగా తాను తొలిసారిగా ఆయనను కలిసిన సందర్భం, ఏయూకు ముఖ్యఅతిథిగా ఆహ్వానించి తీసుకువచ్చిన సందర్భాలను ఆయన గుర్తు చేసుకున్నారు. జస్టిస్ రామస్వామి చారిత్రాత్మకమైన తీర్పులు అందించారని పేర్కొన్నారు. తాను ఉన్నత స్థానంలో నిలవడానికి తన గురువులు అందించిన అత్యుత్తమ బోధన, మార్గదర్శకమే కారణమని, ఈ అవకాశాన్ని దైవం ఇచ్చిన వరంగా భావిస్తున్నానని జస్టిస్ దేవానంద్ అన్నారు. ఏయూ న్యాయ కళాశాల విద్యార్థిగా తన కళాశాల రోజులను, ప్రత్యేక న్యాయ కళాశాల ఏర్పాటుకు చేసిన కృషిని, న్యాయ కళాశాలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరును ప్రతిపాదించిన సందర్భాలను ఆయన గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఆచార్యులకు తాను ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని వేదికపై స్మరించుకున్నారు. అంతకుముందు ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల ఎందరో న్యాయ కోవిదులను సమాజానికి అందించిందని చెప్పారు.

రెండో రోజూ ఆరోగ్యశ్రీ సేవలు బంద్

మహారాణిపేట: ఆరోగ్యశ్రీ వైద్య సేవలకు శనివారం కూడా తీవ్ర అంతరాయం కలిగింది. ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ ట్రస్టు నుంచి బకాయిలు చెల్లించకపోవడంతో ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ ఆస్పత్రుల అసోసియేషన్ (ఆషా) ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి నెట్‌వర్కు ఆస్పత్రులు వైద్య సేవలు నిలిపివేశాయి. దీంతో జిల్లాలోని 63 నెట్‌వర్కు ఆస్పత్రుల పరిధిలో అత్యవసర సేవలను మాత్రమే రెండో రోజు స్వీకరించారు. వీటిలో 27 ఆస్పత్రుల్లో ఓపీ, ఐపీ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. వైద్యం కోసం నెట్‌వర్కు ఆస్పత్రులకు వచ్చిన రోగులు అడ్మిషన్లు లభించక, చికిత్స అందక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల ఈఎంఎస్, వర్కింగ్ జర్నలిస్టులకు కూడా ఆరోగ్యశ్రీ సేవలు దూరమయ్యాయి.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన అవసరం



కలెక్టర్ సతీమణి,న్యాయవాది దివ్యా ప్రసాద్‌ను సన్మానిస్తున్న కేజీహెచ్ క్యాన్సర్ వైద్యురాలు శిల్ప

మహారాణిపేట: మహిళల్లో వచ్చే రొమ్ము క్యాన్సర్‌పై గ్రామస్థాయి నుంచి ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కలెక్టర్ సతీమణి, ప్రముఖ అడ్వకేట్ దివ్య ప్రసాద్ అన్నారు. ‘పింక్ మంత్’ భాగంగా కేజీహెచ్‌లో మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ శిల్ప ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్రతి మహిళ ఏడాదికి ఒకసారి విధిగా అన్ని వైద్య పరీక్షలు చేయించుకోవాలని దివ్య ప్రసాద్ కోరారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి మాట్లాడుతూ రొమ్ము క్యాన్సర్‌పై అవగాహనతో పాటు మెమోగ్రామ్, ఇతర వైద్య పరీక్షలను కేజీహెచ్‌లో ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. క్యాన్సర్ లక్షణాలను ముందుగా గుర్తించడం ద్వారా సకాలంలో నయం చేయవచ్చని రేడియాలజీ విభాగతకి డాక్టర్ కె. బుజ్జి బాబు పేర్కొన్నారు.

14న వైద్య కళాశాలల ప్రైవేట్‌పరంపై బహిరంగ చర్చ

అల్లిపురం: మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో నిర్మించిన 17 వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేట్‌పరం చేయడం, అలాగే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాలపై ద్వారకానగర్ పబ్లిక్ లైబ్రరీలో 14న బహిరంగ చర్చ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్టు ఆ పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పాకా సత్యనారాయణ తెలిపారు. బహిరంగ చర్చలో వైఎస్సార్ సీపీ, సీపీఎం, సీపీఐ, బీఎస్పీ, స్టీల్ ప్లాంట్ కార్మిక సంఘాలు, న్యాయవాద సంఘాలు పాల్గొంటాయని ఆయన పేర్కొన్నారు.

‘కంగారు’ పడతారా? పెట్టిస్తారా

- నేడు భారత్–ఆస్ట్రేలియా మ్యాచ్
- విజయంపై కన్నేసిన టీం ఇండియా మహిళల జట్టు



స్టేడియంలో ఆస్ట్రేలియా జట్టు సభ్యులు





ప్రాక్టీస్‌లో భారత జట్టు క్రీడాకారిణులు

విశాఖ స్పోర్ట్స్: ఐసీసీ వుమెన్ వరల్డ్ కప్‌లో అత్యంత రసవత్తరమైన పోరుకు విశాఖ వైఎస్సార్ స్టేడియం సిద్ధమైంది. వరుసగా మూడుసార్లు వరల్డ్ కప్ విజేతగా నిలిచిన డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాతో గత రన్నరప్ భారత్ ఆదివారం డే–నైట్ మ్యాచ్‌లో ఢీకొట్టనుంది. ఈ పోరు మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమవుతుంది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లో ఐదు పాయింట్లతో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. భారత్ నాలుగు పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. గత మ్యాచ్‌లో ఓటమిపాలైన భారత జట్టు, ఈ మ్యాచ్‌లో విజయం సాధించి పుంజుకోవాలని పట్టుదలతో ఉంది. జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ నాయకత్వంలో ఆటగాళ్లు శనివారం ప్రాక్టీస్‌లో శ్రమించారు.

మంధాన రికార్డుపై దృష్టి

భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన ఈ మ్యాచ్‌లో మరో 58 పరుగులు చేయగలిగితే.. వన్డేల్లో 5,000 పరుగుల మార్కును చేరుకోనుంది.

టాస్ గెలిస్తే బౌలింగ్‌కు అనుకూలం

విశాఖలో వర్షాల కారణంగా పిచ్ కొద్దిగా తడిగా ఉండటంతో టాస్ గెలిచిన జట్టు లక్ష్య ఛేదనకే మొగ్గుచూపే అవకాశం ఉంది.

మిథాలీరాజ్ స్టాండ్, కల్పన ఎంట్రీల ప్రారంభం

భారత మాజీ కెప్టెన్ మిథాలీరాజ్ పేరిట ఒక స్టాండ్‌ను, ఆంధ్ర మహిళా క్రికెటర్ కల్పన పేరిట ఒక ప్రవేశ ద్వారాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఈ స్టాండ్, ప్రవేశద్వారాలను ప్రారంభించనున్నారు.

‘గ్లో అప్ గాల’..మిలమిల



బీచ్‌రోడ్డు: విశాఖలో తొలిసారిగా నిర్వహించిన ‘గ్లో అప్ గాల’ మేకప్ అవార్డ్స్, మెగా మోడలింగ్ ఈవెంట్ శనివారం మిరిమిట్లు గొలిపే విద్యుత్ వెలుగుల్లో ఆకట్టుకుంది. రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన సుమారు 30 మంది మోడల్స్.. ఇండియన్ బ్రైడ్స్, లెహెంగాస్, వెస్ట్రన్ గౌన్స్, వన్ మినిట్ శారీస్‌లో ర్యాంప్‌పై మెరిశారు. న్యాయ నిర్ణేతలుగా మిస్ ఇండియా యూనివర్స్ హేమల తా రెడ్డి, మిస్ ఒడిశా సుప్రియ, మిస్ ఆంధ్ర సరిత, అంతర్జాతీయ మోడల్ కోచ్ రోహిత్ సువ్వాడ వ్యవహరించారు.

నేడు మంత్రి నారా లోకేష్ రాక

మహారాణిపేట: మంత్రి నారా లోకేష్ ఆదివారం విశాఖ వస్తున్నారు. ఉదయం 10 గంటలకు మధురవాడలో ఐటీ సెజ్‌లో ఎస్ఐఎఫ్‌వై డేటా సెంటర్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.30 గంటలకు రామ్‌నగర్ ఎన్టీఆర్ భవన్‌కు చేరుకుంటారు. పీఎంపాలెం క్రికెట్ స్టేడియంలో జరగనున్న ఇండియా–ఆస్ట్రేలియా మహిళల క్రికెట్ మ్యాచ్‌కు హాజరవుతారు. రాత్రి 11.40 గంటలకు విమానంలో తిరుగు ప్రయాణమవుతారు.

రౌడీషీటర్ హత్యకేసులో కొత్తకోణం

- తొలుత పవన్ అనే వ్యక్తిపై గౌరీశంకర్ టీమ్ హత్యాయత్నం
- అనంతరం రౌడీషీటర్ శ్రీధర్‌ను మరో మహిళతో కలిసి హత్య చేసిన వైనం
- రెండు ఘటనల్లో నలుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు
- ద్వారకా ఏసీపీ నరసింహమూర్తి వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి

ఎంవీపీకాలనీ: విజయవాడకు చెందిన రౌడీషీటర్ శ్రీధర్ హత్య కేసులో మరోకొత్త కోణం వెలుగు చూసింది. ఈ హత్యకేసులో నిందితుడైన యలమంచలికి చెందిన రౌడీషీటర్ గౌరీశంకర్ తొలుత మద్దిలపాలెంలో పవన్ అనే వ్యక్తిపై హత్యాయత్నం చేసినట్లు పోలీసులు వెల్లడించారు. శ్రీధర్ హత్య, పవన్ అనే వ్యక్తిపై హత్యాయత్నం ఘటనలకు సంబంధించి నలుగురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి శనివారం రాత్రి ఎంవీపీ కాలనీ పోలీసు స్టేషన్‌లో ద్వారకా ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి విలేకరులకు వివరాలు వెల్లడించారు. రౌడీషీటర్లు శ్రీధర్, గౌరీశంకర్‌లు పాతకేసుల్లో భాగంగా ఈ నెల 7వ తేదీన విశాఖ జిల్లా కోర్టుకు వాయిదాకు హాజరయ్యారు. అనంతరం విశాఖలోని పలు ప్రాంతాల్లో కారులో తిరుగుతూ మద్యం సేవించారు. గౌరీశంకర్‌కు విశాఖలో సాయి అనే స్నేహితుడు ఉన్నాడు. అతనికి పవన్ అనే వ్యక్తికి కొంతకాలంగా గొడవలు ఉన్నాయి. ఈ క్రమంలో పవన్‌ని హత్య చేయాలని గౌరీశంకర్, సాయి ఇటీవల నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో గౌరీశంకర్, శ్రీధర్, సాయి, అసీఫ్(సాయి స్నేహితుడు) కలిసి పవన్‌పై హత్యాయత్నానికి ప్రయత్నించారు. 7వ తేదీ రాత్రి మద్దిలపాలెంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అయితే ఈ దాడి నుంచి పవన్ తప్పించుకొని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎంవీపీ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఆరా తీశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు తొలుత సాయిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ఈ హత్యాయత్నంలో తనతో పాటు గౌరీశంకర్, అసీఫ్‌లు కూడా ఉన్నట్లు సాయి వెల్లడించాడు. దీంతో పోలీసులు వారిని కూడా అదుపులోకి తీసుకొని విచారించి హత్యాయత్నంలో భాగస్వాములను చేశారు.

చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులు

ఈ ఘటనలో పోలీసులు చాకచక్యంగా వ్యవహరించడంతో రౌడీషీటర్ శ్రీధర్ హత్య వ్యవహారం వెలుగులోకి వచ్చింది. పవన్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు తొలుత అదే కోణంలో దర్యాప్తు చేశారు. అయితే సెల్ టవర్ సిగ్నల్ పరిశీలించినప్పుడు గౌరీశంకర్ నెంబర్ సిగ్నల్ ఉన్న ప్రతీచోట మరో వ్యక్తి నెంబర్ వ్యక్తి కూడా కనిపించింది. అయితే ఆ వ్యక్తి ఎవరనే విషయంపై ఎంవీపీ పోలీసులు తొలి నుంచి అనుమానం వ్యక్తం చేశారు. పలు సిగ్నల్ పాయింట్‌ల్లో పరిశీలించినప్పుడు కూడా ఇదే పరిస్థితి ఉండటంతో ఆ నెంబర్ ఎవరిదనే విషయంపై ఆరాతీశారు. ఈ విషయంపై గౌరీశంకర్‌ను తమదైన శైలిలో మరోసారి విచారించగా అసలు విషయం బయటపడింది. తొలుత 7వ తేదీ ఉదయం కోర్టుకు హాజరైన అనంతరం గౌరీశంకర్, శ్రీధర్ మద్యం సేవిస్తూ నగరంలో పలుచోట్ల తిరిగారు. అనంతరం శ్యామల అనే మహిళ ఇంటికి వెళ్లారు. రాత్రి మద్దిలపాలెంలో పవన్ అనే వ్యక్తిపై హత్యాయత్నం ఘటనలో పాల్గొన్నారు. తరువాత గౌరీశంకర్, శ్రీధర్ శ్యామల కలిసి కారులో అక్కడ నుంచి పరారయ్యారు. తరువాత గౌరీశంకర్, శ్రీధర్ మధ్య గొడవ చోటుచేసుకుంది. ఈ క్రమంలో గౌరీశంకర్, శ్యామల.. శ్రీధర్‌ను హత్యచేసి యలమంచలిలోని పోలవరం కెనాల్‌లో పడేశారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన ఎంవీపీ పోలీసులను ఏసీపీ నరసింహమూర్తి ప్రశంసించారు. రెండు కేసుల్లో గౌరీశంకర్‌తో పాటు శ్యామల, సాయి, అసీఫ్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంవీపీ సీఐ ప్రసాద్, ఎస్ఐ ధనుంజయ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లిన యువకుడి గల్లంతు



బంగార్రాజు(ఫైల్)



తీరం వద్ద విషాదంలో కుటుంబ సభ్యులు

పరవాడ: చేపల వేటకు వెళ్లిన ఓ యువకుడు సముద్రపు కెరటాల తాకిడికి పడవ నుంచి జారి గల్లంతైన విషాద ఘటన పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం తీరంలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ముత్యాలమ్మపాలెం సమీపంలోని దిబ్బపాలెం గ్రామానికి చెందిన అరిజిల్లి బంగార్రాజు (17) ప్రాణాలు కోల్పోయాడు. చేతికి అందివచ్చిన కొడుకు సముద్రపు రాక్షస అలలకు బలై తమను అనాథలను చేశాడని మృతుడి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతుడు బంగార్రాజుతో పాటు తోటి మత్స్యకారులు చింతకాయల కొర్లయ్య, కొండబాబు, మధు, హరి, మేరిగి ముత్యాలు... మొత్తం ఆరుగురు మత్స్యకారులు కలిసి ఒక తెప్పపై శనివారం తెల్లవారుజామున 2:30 గంటల సమయంలో చేపల వేటకు బయలుదేరారు. తీరాన్ని దాటి సముద్రంలోపలికి వెళ్తున్న క్రమంలో, సముద్రంపై నుంచి ఉధృతంగా వచ్చిన బలమైన కెరటం వీరు ప్రయాణిస్తున్న తెప్పను బలంగా ఢీకొట్టింది. ఆ సమయంలో తెప్పలో ఉన్న బంగార్రాజు ఒక్కసారిగా సముద్రంలో పడిపోయాడు. వెంటనే స్పందించిన తోటి కార్మికులు సముద్రంలో గాలించినప్పటికీ ఫలితం దక్కలేదు. అనంతరం మరో మూడు తెప్పలపై బంగార్రాజు ఆచూకీ కోసం గాలించినా ప్రయోజనం కనిపించలేదు. ప్రమాద సమాచారాన్ని అందుకున్న పరవాడ సీఐ ఆర్. మల్లికార్జునరావు తన సిబ్బందితో వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ బి.నాగరాజు కూడా ఘటనా స్థలాన్ని సందర్శించి, గల్లంతైన మృతదేహం కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. శనివారం ఉదయం నుంచి మృతుడి జాడ కోసం పూడిమడక, పెదగంట్యాడ తీర ప్రాంతాల వరకు పడవలపై విస్తృతంగా గాలించారు. సాయంత్రానికి కూడా మృతుడి ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. జనసేన మండల ఇన్‌చార్జ్ పంచకర్ల ప్రసాద్, సర్పంచ్ చింతకాయల సుజాత మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రమాద కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతుడికి తండ్రి అప్పన్న, తల్లి సత్యవతి, అక్క మౌనిక ఉన్నారు. మృతుడి ఆచూకీ కోసం రాత్రి వరకు గాలింపు చర్యలు ముమ్మరం చేసినప్పటికీ ఫలితం కనిపించలేదు.

మెడికల్ కాలేజీలు ధారాదత్తం



మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

సీతంపేట: కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో ప్రైవేటు యాజమాన్యాలకు ధారాదత్తం చేయడం ఖాయమని, ఈ విషయాన్ని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నర్సీపట్నం పర్యటనలో బట్టబయలు చేయడంతో మింగుడు పడని కూటమి నాయకులు అవాకులు చెవాకులు పేలుతున్నారని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీ అన్నారు. లలితానగర్‌లోని తన కార్యాలయంలో శనివారం మీడియాతో ఆయన మాట్లాడుతూ జనసేన దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయడం లేదని ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ మాట్లాడారన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌కు పీపీపీకి, ప్రైవేట్‌కు తేడా తెలియదని అజ్ఞానంతో ఆయన చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని తెలిపారు. విద్య, వైద్యం అనేవి వైద్య విద్యలోనే కలిసి ఉన్నాయని, అవి ప్రజల ప్రాథమిక హక్కులకు, ప్రజల మనోభావాలకు, జీవితాలకు సంబంధించిన అంశమని, వాటిని తాకట్టుపెట్టే అధికారం నైతికంగా ఏ ప్రభుత్వానికి లేదన్నారు. ఈ విషయాన్ని వంశీకృష్ణ తెలుసుకోవాలని సూచించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గత వైఎస్ జగన్ ప్రభుత్వంలో 17 మెడికల్ కాలేజీల ఏర్పాటుకు అనుమతులిచ్చి నిర్మాణాలు ప్రారంభించడం రాష్ట్రానికి వైద్య రంగంలో ఒక వరంగా భావించాలన్నారు. కూటమి ప్రభుత్వం పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్యను దూరంగా, భారంగా మార్చిందన్నారు. సామాన్యులు వైద్యాన్ని డబ్బులిచ్చి కొనుక్కునే పరిస్థితి ప్రభుత్వ ఆస్పత్రుల్లో వస్తుందన్నారు. ఆరోగ్యశ్రీకి తూట్లు పొడవడంతో వైద్యం కోసం వెళ్లే ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కూటమి సర్కారు కళ్లు తెరిచి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడకుండా ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మెడికల్ కాలేజీలు, బోధన ఆస్పత్రులు నిర్వహించాలని జాన్‌వెస్లీ కోరారు.

బదిలీపై వెళ్తున్న విశ్వనాథన్‌కు ఘన సత్కారం




విశ్వనాథన్‌కు సత్కరిస్తున్న కలెక్టర్

తాటిచెట్లపాలెం: రాష్ట్ర సమాచార, ప్రజా సంబంధ శాఖ డైరెక్టర్‌గా బదిలీపై వెళ్తున్న వీఎంఆర్‌డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్‌ను కలెక్టర్ హరేందిర ప్రసాద్, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విశ్వనాథన్ విశాఖ నగర అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, ముఖ్యంగా ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ ఆయన చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు గొప్పవని కొనియాడారు. కేఎస్ విశ్వనాథన్ మాట్లాడుతూ.. విశాఖలో పనిచేయడం గొప్ప అనుభూతిని ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, ప్రధాన ఇంజినీర్ వినయ్‌కుమార్, ఎస్టేట్ అధికారి దయానిధి, పర్యవేక్షక ఇంజినీర్లు భవాని శంకర్, మధుసూదనరావు, ముఖ్య ప్రణాళికాధికారిణి శిల్ప, ముఖ్య గణాంకాధికారి హరిప్రసాద్ పాల్గొన్నారు.

యాంటి డ్రగ్ గ్లో థీమ్ పార్క్‌కు శంకుస్థాపన

విశాఖ సిటీ: యువశక్తి ముఖ్యమైన వనరు అని, అలాంటి యువత చెడు దారి పట్టకుండా ఉండేందుకు విశాఖలోని వీఎంఆర్‌డీఏ సెంట్రల్ పార్కులో 2 ఎకరాల్లో రూ.3.5 కోట్లతో యువగళం యాంటి డ్రగ్ గ్లో థీమ్ పార్క్‌ను నూతనంగా నిర్మించారు. కేంద్ర పౌర విమాన యాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు శనివారం వర్చువల్‌గా దీనిని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, నిర్ణీత సమయంలో నిర్మాణం పూర్తి చేయాలని, ప్రజలు, యువత సలహాలు తీసుకోవాలని సూచించారు. భోగాపురం ఎయిర్‌పోర్టుకు జాతీయ రహదారి అనుసంధానానికి వీఎంఆర్‌డీఏ చర్యలు తీసుకుంటున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ మాట్లాడుతూ డ్రగ్స్ వలన కలిగే అనర్థాలను తెలియజేసి, యువతలో చైతన్యం కలిగించేలా ప్రపంచంలోనే మొదటిసారిగా ఈ యాంటీ డ్రగ్ పార్క్‌ను అందుబాటులోకి తెస్తున్నామని చెప్పారు. దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కూడా ఈ తరహా పార్క్ యువతను సన్మార్గంలో నడిపించడానికి అవసరమని అభినందించారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ కె.రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, సీఈ వినయ్‌కుమార్, పర్యవేక్షక ఇంజినీర్లు భవానీ శంకర్, మధుసూదనరావు, ముఖ్య ప్రణాళిక అధికారి శిల్ప, డీఎఫ్‌వో సుజాత శివాని పాల్గొన్నారు.

విల్లులా వంగి... గాల్లో గింగిరాలు..



విశాఖ స్పోర్ట్స్: రాష్ట్ర అంతర జిల్లాల జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు జిల్లా జట్ల ఎంపిక పోటీలు శనివారం పాండురంగాపురం జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ ఇండోర్ హాల్‌లో నిర్వహించారు. దాదాపు 60 మంది చిన్నారి బాలబాలికలు ఈ ఎంపిక పోటీల్లో చక్కటి ప్రదర్శన చేశారు. అండర్ 6 నుంచి అండర్ 17 వరకు వివిధ వయసుల బాలబాలికల విభాగాల్లో జట్లను ఎంపిక చేసినట్టు కోచ్ మనోహర్ తెలిపారు.

బ్యూటీ సెలూన్ ముసుగులో వ్యభిచారం

కూర్మన్నపాలెం: దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని కూర్మన్నపాలెం వద్ద ‘లవిషి బ్యూటీ సెలూన్’ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు శుక్రవారం రాత్రి ఈ సెలూన్‌పై దాడి చేయగా వ్యభిచారం నిర్వహిస్తున్న ముగ్గురు నిర్వాహకులు, ఒక సహాయకుడు, ముగ్గురు విటులు పట్టుబడ్డారు.ఈ సెలూన్‌ను రాజీవ్‌నగర్‌కు చెందిన కిల్లాడ ప్రవీణ్, పార్కు హోటల్ వద్ద నివాసముంటున్న య. పురపు దమయంతి, గాజువాక కుంచమాంబ కాలనీకి చెందిన కొసనం హైమవతి నిర్వహిస్తున్నారని పోలీసులు తెలిపారు. వీరికి రాజీవ్‌నగర్‌కు చెందిన అమిత్ గౌతమ్ సహకరిస్తున్నాడన్నారు. ఈ దాడిలో నిర్వాహకులు, ముగ్గురు విటులతో సహా మొత్తం ఏడుగురిని అరెస్టు చేసినట్లు పోలీసులు వివరించారు. ఈ కేసులో పట్టుబడిన బాధితురాలైన మహిళను సేఫ్ కస్టడీకి పంపించినట్లు పోలీసులు తెలిపారు.